
AP 4PG 6 - 1- 2026 TUESDAY qxp_Layout 1 06-01-2026 05:41 AM Page 1

విలేకరులు కావలెను
ఆంధ్ర తెలంగాణ రెండు తెలుగు రాష్ట్రాలలో
జిల్లాల వారీగా స్టాప్ రిపోర్టర్స్, మండల
రిపోర్టర్, కంట్రిబ్యూటర్స్, యాడ్ ఎగ్జిక్యూటివ్స్, కావలెను
తెలుగు భాషపై అవగాహన, వార్తలు రాయగల సత్తా
ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును
MOBILE : 8886090199, 9885211993,

అనంత ప్రభ
తెలుగు దిన పత్రిక



అనంతపురం
శ్రీ సత్యసాయి
5
మంగళవారం 6 జనవరి 2025

# గ్రేటర్ రాయలసీమ రైతాంగానికి తీరని అన్యాయం

- ముందు నుంచి ఆయనది అదే ధోరణే..!
- శిష్యుడి ప్రయోజనాల కోసం రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని అటకెక్కించారు..!
- ప్రత్యేక హోదాను తాకట్టు పెట్టి కమీషన్ల కోసం ప్రత్యేక ప్యాకేజీ తెచ్చుకున్న ఘనుడుచంద్రబాబు..!
- రాప్తాడు మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ సమన్వయకర్త తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆగ్రహం



అనంతపురం, జనవరి 5 (అనంత ప్రభ)
గ్రేటర్ రాయలసీమ రైతంగానికి ముఖ్యమంత్రి చంద్రబాబు తీరని అన్యాయం చేశాదని రాప్తాడు మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ సమన్వయకర్త తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశాడు. సోమవారం అనంతపురంలోని వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడాడు. కనీసం అప్పీల్ కూడా చేయకుండా ఈరోజు సంపూర్ణంగా తెలంగాణలో తన శిష్యుడి ప్రయోజనాలను కాపాడుతూ చంద్రబాబు రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీంను అటక్కెండు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో మాట్లాడుతూ తన పలుకుబడి, తాను పెట్టిన ఒత్తిడి వల్ల చంద్రబాబు తలొగ్గి రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును ఆపేశాదని చెప్పారు. ఇంతవరకు ఈ విషయం చెప్పుకోలేదని ఇప్పుడు సందర్భం వచ్చింది కాబట్టి బయట పెడుతున్నానంటూ గర్వంగా చెప్పుకున్నాడు. చంద్రబాబుకు అత్యంత సన్నిహితుడు కావడం, చంద్రబాబుతో అనేక ఆర్థిక లావాదేవీలుండడం వల్ల ఇది సాధ్యమైందనే తెలంగాణలో చర్చ జరుగుతోంది.

గతంలో కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు పాలమూరు రంగారెడ్డి, దిండి ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టి రోజుకు 2 టీఎంసీల నీటిని తరలించే పనులు శరవేగంగా జరుగుతున్నా ఆరోజు చంద్రబాబు కనీసం అడ్డుచెప్పలేదు. ఓటుకు నోటు కేసులో అడ్డంగా దొరికిపోయిన చంద్రబాబు ఆ కేసుకు భయపడే నోరు విప్పలేదు. హైదరాబాద్ రాజధానిగా పదేళ్ల ఉపయోగించుకునే హక్కును కూడా వదులుకుని పారిపోయి కరకట్టకు వచ్చి దాక్కున్నాడు. తెలంగాణలో చంద్రబాబుకు ఉన్న విస్తృతమైన వ్యాపారాలు, భూముల కారణంగా తెలంగాణ ప్రభుత్వంపై పోరాడే దాఖలాలు లేవు.

స్వలాభం, రాజకీయ లాభం కోసం ఆంధ్రప్రదేశ్ రైతుల హక్కులను తాకట్టు పెడుతున్నారనేది స్పష్టమైంది. పోలవరం ప్రాజెక్టును పూర్తిస్థాయి కేంద్రం నిధులతో నిర్మించాలని విభజన చట్టంలో హక్కు ఉన్నా తామే నిర్మిస్తామంటూ కేంద్రాన్ని కోరడంతో ఆమోదం తెలిపింది. ఇలా 2014లో చంద్రబాబు చేతికి వచ్చిన పోవవరం ప్రాజెక్టు తర్వాత ఎలా నిలిచిపోయిందో అందరికీ తెలుసు. ప్రత్యేక హోదాను తాకట్టు పెట్టి కమీషన్ల కోసం ప్రత్యేక ప్యాకేజీ తెచ్చుకున్న ఘనుడు చంద్రబాబు.

రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టడంతో చంద్రబాబు అనేక సందర్భాల్లో తనను తానే రుజువు చేసుకున్నాడు. డిల్లీలో చక్రం తిప్పుతున్నానంటూ చెప్పుకునే ఆరోజుల్లో కర్నాటక రాష్ట్రం ఆల్మట్టి డ్యాం ఎత్తును పెంచుతున్నా చంద్రబాబు కనీసం నోరు మెదపలేదు. ఈ కారణంగా శ్రీశైలం డ్యాంకు కృష్ణానది నుంచి నీళ్లు వచ్చే పరిస్థితే లేదు. 200 టీఎంసీల పాసిటీ ఉన్న తుంగభద్ర డ్యాంలో పూడిక వల్ల కేవలం 100 టీఎంసీలకే పరిమితం అయింది. వర్షాలు పడే రోజులు తగ్గిపోవడం వల్ల తుంగభద్ర డ్యాం నుంచి వచ్చే జలాలు కూడా తగ్గాయి. అయితే తుంగభద్ర నుంచి కృష్ణానదిలోకి 32 టీఎంసీల నీటిని మాత్రమే కలపాల్సి ఉంది. పైగా వచ్చి నీటిని మనం వాడుకోవచ్చు. పూడిక వల్ల తుంగభద్ర డ్యాంకు దిగువలో ఉన్న అనంతపురం జిల్లా హెచ్ఎల్‌సీ కాలువ, కర్నూలు జిల్లా ఎల్ఎల్‌సీ కాలువల ద్వారా తుంగభద్ర నీటిని వినియోగించుకోలేకపోతున్నాం. అలాంటప్పుడు సమాంతర కాలవ నిర్మాణం, రిజర్వాయర్ల నిర్మాణం ద్వారా నీటిని వినియోగించుకోవచ్చు. ప్రతిపాదత దశలో ఉన్న గుండ్రేవుల ప్రాజెక్ట్ నిర్మాణం పూర్తి చేసుకోవచ్చు. అనంతపురం జిల్లాలోనూ వివిధ రిజర్వేయర్ల నిర్మాణం చేసుకోవచ్చు. రాయదుర్గం, కాలవపల్లి ప్రాంతాల్లో ప్రాజెక్టుల నిర్మాణాలకు డీపీఆర్‌లు సిద్ధంగా ఉన్నాయి. చంద్రబాబుకు ఇవేవీ పట్టడం లేదు.

పోతిరెడ్డిపాడు ప్రాజెక్ట్ నుంచి 100 టీఎంసీల నీటిని తీసుకునే హక్కు ఉన్నా 2020,21,22 ఈ మూడేళ్లు తప్ప ఏ సంవత్సరంలోనూ 40 టీఎంసీలకు మించి నీటిని తీసుకోలేదు. రాయలసీమ ప్రయోజనాలకు వ్యతిరేకంగా పోరాడిన వారిని ఇరిగేషన్ మంత్రిని చేసిన ఘనత చంద్రబాబుకు దక్కుతుంది. 854 అడుగుల ఎంపీడీఎల్ ఉన్న శ్రీశైలం ప్రాజెక్టును చంద్రబాబు హయాంలో 830 అడుగులకు పరిమితం చేశారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వచ్చిన తర్వాత దీన్ని కరెక్ట్ చేస్తే అప్పట్లో దేవినేని ఉమా ప్రకాశం బ్యారేజీపై ధర్నా చేశాడు. దీని ఫలితంగా 2014లో అధికారంలోకి రాగానే ఆయనను ఇరిగేషన్ మంత్రిని చేశాడు.

వరుణదేవుడు కరుణిస్తే తప్ప రాయలసీమ ప్రాంతంలో వేరుశనగ పంట పండదు. ప్రాజెక్టులు నిర్మాణం అయినా వరుణదేవుడు కరుణిస్తే తప్ప పోతిరెడ్డిపాడు ప్రాజెక్ట్ నుంచి పూర్తిస్థాయి సామర్థ్యంలో నీటిని తీసుకోలేని పరిస్థితిలో ఉన్నాం. ఇలాంటి పరిస్థితుల్లో రేవంత్‌రెడ్డితో కుమ్మక్కై రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని ఆపాలనే చంద్రబాబు చర్యలను ఖండిస్తున్నాం. రాయలసీమ ప్రాంత రైతులు ఉద్యమించాల్సిన అవసరం వచ్చింది. ఈ ప్రాంతంలో ఉన టీడీపీ ఎమ్మెల్యేలు రాజీనామాలు చేయాలని డిమాండ్ చేస్తున్నాం.

సీఎం చంద్రబాబు ఇప్పటికైనా కళ్లు తెరవాలి. అనంతపురం జిల్లా రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని తుంగభద్ర నుంచి సమాంతర కాలువ తీసుకొచ్చి హంద్రీనీవాకు లింకు చేయాలని కోరారు. అలాగే తానే డీపీఆర్ సిద్ధం చేయించానని చెప్పుకుంటున్న చంద్రబాబు గుండ్రేవుల ప్రాజెక్ట్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి. శ్రీశైలం, తుంగభద్ర డ్యాంల్లో పూడిక వల్ల దాదాపు 200 టీఎంసీల నీటిని కోల్పోతున్నాం. ఆ మేరకు డ్యాంలు నిర్మాణం చేపట్టాలి. శ్రీశైలం డ్యాం భద్రత దృష్ట్యా ఎగువన సిద్ధేశ్వర ప్రాజెక్ట్, గుండ్రేవుల ప్రాజెక్ట్, సమాంతర కాలువ నిర్మాణం పూర్తి చేయాలొ

## ఆదర్శప్రాయులు.. అనంత వెంకటరెడ్డి

- నేటి తరానికి 'అనంత జీవితం' స్ఫూర్తిదాయకం
- అనంత వెంకటరెడ్డి ఆశయాలను కొనసాగిస్తాం
- 26వ వర్ధంతిలో ప్రజాప్రతినిధులు, వైసీపీ నాయకులు



అనంతపురం, జనవరి 5 (అనంత ప్రభ)
కరువుకు నిలయంగా ఉన్న అనంతపురం జిల్లాలో రైతాంగ సమస్యల పరిష్కారానికి అనంత వెంకటరెడ్డి చేసిన కృషి మరువలేనిదని పలువురు నాయకులు తెలిపారు. అనంతపురం జిల్లా రాజకీయ చరిత్రలో సుదీర్ఘ కాలం ప్రజాప్రతినిధిగా పని చేసిన అనంత వెంకటరెడ్డి జీవితం స్ఫూర్తిదాయకమని.. నేటి తరానికి ఆయన ఆదర్శప్రాయులని కొనియాడారు. సోమవారం అనంత వెంకటరెడ్డి 26వ వర్ధంతి సందర్భంగా ప్రజాప్రతినిధులు, వైఎస్ఆర్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అనంత అభిమానులు ఘనంగా నివాళి అర్పించారు. ముందుగా అనంతపురం ప్రభుత్వ సర్వజనాస్పత్రి ఎదుట ఉన్న అనంత వెంకటరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. జోహార్.. అనంత వెంకటరెడ్డి అంటూ నినాదాలు చేశారు. అనంతరం సర్వజనాస్పత్రి వద్ద అన్నదానం చేపట్టారు. ఆ తర్వాత బుక్కరాయసముద్రం మండలం రోటరీపురం వద్ద ఉన్న ఘాట్‌కు వెళ్లి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా అనంత వెంకటరెడ్డి చేసిన సేవలను మాజీ మంత్రి సాకే శైలజానాథ్, ధర్మవరం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, ఎమ్మెల్సీ మంగమ్మ, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, వైసీపీ బీసీ సెల్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రమేష్ గౌడ్, పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షులు వెన్నపూస రవీంద్రారెడ్డి, మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్, వైసీపీ సీనియర్ నేత కేవీ రమణ కొనియాడారు. రాయలసీమ ప్రాంతం అంతా స్మరించుకోదగ్గ గొప్ప నాయకుడు అనంత వెంకటరెడ్డి అని తెలిపారు. ఈ రోజు కరువు నివారణ చర్యలు జిల్లాలో చేపడుతున్నారంటే దానికి ఆద్యులు అనంత వెంకటరెడ్డి అని గుర్తు చేశారు. హంద్రీనీవా సాధన కోసం అనంత వెంకటరెడ్డి అహర్నిశలు కృషి చేశారని తెలిపారు. అందుకోసమే వైఎస్ రాజశేఖరరెడ్డి హంద్రీనీవా పథకానికి అనంత వెంకటరెడ్డి పేరు పెట్టారని, కానీ నేడు కూటమి ప్రభుత్వం అనంత వెంకటరెడ్డి పేరును తొలగించిందని విమర్శించారు. తొలి తరం సాగునీటి ప్రాజెక్టుల ఉద్యమ రథసారధి అనంత వెంకటరెడ్డి అని, అప్పులు బాధ తాళలేక చుక్కనీరు లేక రైతులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితుల్లో అందరినీ కలుపుకుని ఉద్యమం చేశారని గుర్తు చేశారు. నిజాయితీ, విలువలతో కూడిన రాజకీయం చేసిన మనిషి ఈ ప్రాంతంలో పుట్టినందుకు మనమంతా గర్వపడాలని తెలిపారు. అనంత వెంకటరెడ్డి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా ఉండారన్నారు. అత్యంత వెనుకబడిన ప్రాంతాలకు ఆయన చేసిన కృషి ఎనలేనిదని, ఆయన చరిత్రలో నిలిచిపోతారని పేర్కొన్నారు. ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీగా సుదీర్ఘ రాజకీయాల్లో ఉండి రాయలసీమ ప్రాంత సమస్యల పరిష్కారం కోసం పాటుపడ్డారన్నారు. నేటితరం రాజకీయ నాయకులకు ఆయన స్ఫూర్తిదాయులని తెలిపారు.

ప్రజాసేవే పరమావధిగా రాజకీయాలు : అనంత

రాజకీయాలంటే పదవులు అనుభవించడం, అధికారం చలాయించడం కాదు.. ప్రజలకు సేవ చేయడం అని అనంత వెంకటరెడ్డి తనయులు, వైసీపీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. ఇదే విషయాన్ని తన తండ్రి నిత్యం తెలియజేసేవారన్నారు. ఆయన స్ఫూర్తితోనే సుదీర్ఘకాలంగా తాము రాజకీయాల్లో ఉన్నట్లు చెప్పారు. తన తండ్రి అనంత వెంకటరెడ్డి అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా సాధారణ జీవితమే గడిపారని గుర్తు చేసుకున్నారు. అనంతపురం జిల్లా రాజకీయాలంటే కరువు, ఫ్యాక్షన్ గుర్తుకు వస్తాయి. సుదీర్ఘకాలం అనంత వెంకటరెడ్డి గారు రాజకీయాల్లో ఉన్నా ఎక్కడా ఫ్యాక్షన్‌కు తావులేకుండా గడిపారు. స్వార్థం కోసం కాకుండా ప్రాంత ప్రయోజనాల కోసం అహర్నిశలు పాటుపడ్డారని, ఆయన ఆశయాలను ముందుకు తీస్తుళ్తానని అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు.

## అనంత వెంకట రెడ్డి విగ్రహానికి శ్రీమతి బోయ గిరిజమ్మ నివాళులు

అనంతపురం, జనవరి 5 (అనంత ప్రభ)
అనంతపురము అర్బన్ మాజీ ఎమ్మెల్యే , వైఎస్ఆర్సిపి జిల్లా అధ్యక్షులు శ్రీ అనంత వెంకట రామి రెడ్డి గారి తండ్రి గారైన కీ.శే. శ్రీ అనంత వెంకట రెడ్డి గారి 26వ వర్ధంతి సందర్భంగా స్థానిక ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి దగ్గర ఉన్న వారి విగ్రహానికి, శ్రీ అనంత వెంకట రామి రెడ్డి తో కలిసి ఉమ్మడి అనంతపురము జిల్లా ప్రజా పరిషత్ చైర్ పర్సన్ శ్రీమతి బోయ గిరిజమ్మ గారు పూలమాలతో నివాళులు అర్పించి, ఆసుపత్రి వద్ద ఏర్పాటు చేసిన అన్నదాన పంపిణీ కార్యక్రమములో పాల్గొన్నారు. తదనంతరం రొటరీపురం లోని అనంత ఘాట్ నందు అనంత వెంకట రెడ్డి గారికి పుష్పగుచ్ఛములతో నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ గారు మాట్లాడుతూ అనంత వెంకట రెడ్డి గారు జిల్లా ప్రజలకు, రైతులకు అందించిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి ఀ శింగనమల నియోజక వర్గ సమన్వయ కర్త శ్రీ సాకే శైలజానాథ్ గారు, హిందూపురం మాజీ ఎంపి శ్రీ గోరంట్ల మాధవ్ గారు, ఎంఎల్సి శ్రీమతి మంగమ్మ గారు, ధర్మవరం మాజీ ఎమ్మెల్యే



శ్రీ కేతిరెడ్డి వెంకట్రామి రెడ్డి గారు, అనంత నగర పాలక సంస్థ మేయరు, డిప్యూటి మేయర్, కార్పొరేటర్లు, వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు, మహిళ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

## శివుని ప్రతి రూపంగా వెలసిన శ్రీ శ్రీ మహా కాలభైరవ స్వామి

- గోటుకూరులో అతి పురాతన 1000 ఏళ్లకాలం నాటి శ్రీ కాలభైరవ స్వామి
- శివుని రూపంలో వెలసిన పురాతన దైవం
- నిత్యారాధనతో వెలుగొందుతున్న మహా శ్రీ కాలభైరవ స్వామి



కూడేరు, జనవరి 5 (అనంత ప్రభ)
కూడేరు మండల పరిధిలోని గోటుకూరు గ్రామంలో పురాతన కాలంలో వెలసిన ప్రసిద్ధిగాంచిన కాశి శ్రీశ్రీ కాలభైరవ స్వామి గా గోటుకూరులో నేడు నిత్యారాధనతో విశేష పూజలు అందుకుంటున్నారు. అయితే జిల్లాలోని నాటి నుండి నేటి వరకు ఏకైక దేవాలయంగా శ్రీ కాలభైరవ స్వామి 500 సంవత్సరాల క్రితం గోటుకూరులో శివుని ప్రతి రూపంలో వెలసిన శ్రీశ్రీ కాలభైరవ స్వామి గా వెలగొందుతు భక్తుల కోర్కెలు తీర్చే కొంగ బంగారం వెలిశారు. అయితే గోటుకూరు లో 500 సంవత్సరాల నుండి శ్రీ కాలభైరవ స్వామి వెలుగులోకి రావడం, అయితే కాశీ పాలకొడైన స్వామీజీ కాశీలో శివునికి విశేష పూజలు కార్యక్రమాలు నిర్వహిస్తూ దైవసాధనలో ఉన్న ఒక స్వామికి స్వప్నం లో గోటుకూరు లో ఉన్న శ్రీ కాలభైరవ స్వామికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించాలని చెప్పడంతో ఆ స్వామి కాశీ క్షత్రం నుండి శ్రీ కాలభైరవ స్వామి వెతుక్కుంటూ గోటుకూరు కు చేరుకుని అక్కడ గోటుకూరు లోని నిత్యం విశేష పూజ కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రతి సోమవారం మరియు అమావాస్య,పౌర్ణమి, పాడ్య తిదియ కి పవళింప సేవలో శ్రీ కాలభైరవస్వామి కి పాలాభిషేకం, పంచామృత అభిషేకం, అలంకరణ,అర్చన మహానైవేద్యం , మహామంగళహారతి, నిర్వహిస్తాస్తున్నారు. ఈ పూజా కార్యక్రమాలకు భక్తుల సుదూర ప్రాంతాల నుంచి తరలివచ్చి స్వామివారి అభిషేకం, హోమమల యందు పాల్గొన్న స్వామివారిని దర్శించుకుంటున్నారు. స్వామి వారి దర్శన నిమిత్తం వచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రతి అమావాస్య,పౌర్ణమికి శ్రీ కాలభైరవ సన్నిధిలో ప్రత్యేక అన్నప్రసాద కార్యక్రమాన్ని కూడా నిర్వహిస్తున్నారు

## ధర్మవరం ఎన్డీఏ కార్యాలయంలో సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



ధర్మవరం, జనవరి 5 (అనంత ప్రభ)
ధర్మవరం పట్టణంలోని ఎన్డీఏ కార్యాలయంలో రాష్ట్ర వైద్య ఀ ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ గారి సహకారంతో ముఖ్యమంత్రి సహాయ నిధి కింద లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ సందర్భంగా ధర్మవరం నియోజకవర్గ పరిధిలోని 26 మంది లబ్ధిదారులకు సుమారు రూ. 14 లక్షల 32 వేల 987 రూపాయల విలువైన చెక్కులను మంత్రి నియోజకవర్గ ఇన్చార్జ్ హరీష్ బాబు లబ్ధిదారులకు అందజేశారు.
ఈ సందర్భంగా హరీష్ బాబు మాట్లాడుతూ...., ముఖ్యమంత్రి సహాయ నిధి పేద, మధ్యతరగతి కుటుంబాలకు అత్యవసర సమయాల్లో ప్రభుత్వ అండగా నిలుస్తోందని అన్నారు. ముఖ్యంగా తీవ్రమైన అనారోగ్య పరిస్థితుల్లో చికిత్స ఖర్చులు భరించలేని కుటుంబాలకు ఈ సహాయం ఎంతో ఊరట కలిగిస్తుందని పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్యం ప్రభుత్వానికి అత్యున్నత ప్రాధాన్యత అని, అందుకే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు ఈ నిధిని మరింత పారదర్శకంగా, వేగంగా లబ్ధిదారులకు అందేలా చర్యలు తీసుకుంటున్నారని వివరించారు. రాష్ట్ర వైద్య ఀ ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ గారి ప్రత్యేక చొరవతో ధర్మవరం నియోజకవర్గంలోని అర్హులైన ప్రతి ఒక్కరికీ ఈ సహాయం అందేలా కృషి చేస్తున్నామని హరీష్ బాబు తెలిపారు. ప్రభుత్వ సంక్షమ పథకాలు అర్హులైన చిట్టా చివరి వ్యక్తి వరకూ చేరాలన్నదే ఎన్డీఏ కూటమి ప్రభుత్వ లక్ష్యమని, అందుకోసం పార్టీ శ్రేణులు క్షత్రస్థాయిలో పనిచేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఆకులేటి వీరనారప్ప, పోతులనాగేపల్లి లక్ష్మనారాయణ, వడ్డే శినా, బోయ నరసింహులు, ఏలుకుంట్ల లక్ష్మనారాయణ, మైనార్టీ నాయకులు నబి రసూల్, సొమ్లా నాయక్, రవి, భాస్కర్ రెడ్డి, సుబ్రహ్మణ్యం, లబ్ధిదారులు మరియు వారి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారురు.

## ప్రపంచ తెలుగు మహాసభల్లో విష్ణు భగవాన్‌కు సన్మానం



యాడికి, జనవరి 5 (అనంత ప్రభ)
గుంటూరులో జరిగిన 3వ ప్రపంచ తెలుగు మహాసభల్లో శాతవాహన, ఇక్ష్వకు, విష్ణుకుండినులు, విజయనగర సామ్రాజ్య కాలాలకు చెందిన పురాతన నాణెములు, వివిధ రాజ్యాల నాణెములను ప్రదర్శించినందుకు యాడికి పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న విష్ణు భగవాన్‌కు సభా వేదికపై సన్మానం జరిగింది. గౌరవ మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు గారు ఆయనను అభినందించారు. రాయలసీమ నాణెముల సేకరణ సంఘం కార్యదర్శిగా ఉన్న విష్ణు భగవాన్, పోలీస్ ఉద్యోగం చేస్తూనే గత 23 సంవత్సరాలుగా పురాతన నాణెముల సేకరణలో కొనసాగుతూ భారతీయ చారిత్రక వారసత్వ పరిరక్షణకు కృషి చేస్తున్నట్లు తెలిపారు

## కోనుప్పలపాడు గ్రామములో గ్రామసభ



యాడికి, జనవరి 5 (అనంత ప్రభ)
యాడికి మండలం కోనుప్పలపాడు గ్రామంలో సోమవారం గ్రామసభ సమావేశం సర్పంచ్ మార్కె రామలక్ష్మ ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బంది నిర్వహించారు. ఈ సమావేశంలో గ్రామపంచాయతీ నిధుల జమలు, ఖర్చులు,15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టిన పనుల ప్రగతి, పన్నులు, ఫీజుల వసూళ్లు, జి పి డి పి, స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర, జీరో వేస్ట్ నిర్వహణ, వేసవిలో త్రాగునీటి సరఫరా అంశాలపై చర్చించి సమీక్ష నిర్వహించారు. అలాగే సంక్షమ పథకాల లబ్ధిదారుల జాబితా, గ్రామ సచివాలయ సేవల పనితీరు, డిజిటల్ పంచాయతీ, ఆన్‌లైన్ చెల్లింపులు, ఈకేవైసీ, స్వామిత్వ సర్వే తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. 73వ రాజ్యాంగ సవరణలోని 29 అంశాల అమలుపై వివిధ శాఖల క్షత్రస్థాయి సిబ్బంది ప్రగతిని గ్రామసభకు వివరించారు. గ్రామ అభివృద్ధికి ప్రజల సహకారం అవసరమని సర్పంచ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకుడు మార్కె రామాంజనేయులు, పంచాయతీ సెక్రటరీ రామిరెడ్డి, సచివాలయ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు

## యాడికిలో సీసీ రోడ్ల నిర్మాణ పనులు



యాడికి, జనవరి 5(అనంత ప్రభ)
తాడపత్రి ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి ఆదేశాల మేరకు యాడికి మండల కేంద్రంలో సీసీ రోడ్ల నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి . ఈ సందర్భంగా ప్రజా ప్రతినిధులు అభివృద్ధి పనులు వేగవంతం చేసి ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యమని తెలిపారు. స్థానిక ప్రజలు ఈ అభివృద్ధి కార్యక్రమాలపై హర్షం వ్యక్తం చేస్తూ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్వనాథ్, యాడికి టౌన్ ప్రెసిడెంట్ వెలిగండ్ల ఆదినారాయణ, బీసీ సెల్ అధ్యక్షుడు తిరంపురం నీలకంఠ, మాయకుంట్ల నారాయణస్వామి, మైనార్టీ అధ్యక్షుడు సుబహాన్, మండల ప్రధాన కార్యదర్శి దాసరి రామచంద్ర, మేకల రామాంజి, పల్లా పురుషోత్తం, హాజీపీరా, పల్ల శివశంకర్, బద్దల రాముడు తదితరులు పాల్గొన్నారు

## అగాపే వృద్ధాశ్రమంలో అన్నదానం



యాడికి, జనవరి 5 (అనంత ప్రభ )
యాడికి మండల కేంద్రంలోని రాఘవేంద్ర కాలనీలో ఉన్న అగాపే వృద్ధాశ్రమంలో మండల కేంద్రానికి చెందిన దుద్దుకూరి మనోహర్ నాయుడు సువర్ణ దంపతుల పెద్ద కుమారుడు రవీంద్రనాథ్ చౌదరి 25వ పుట్టినరోజు శుభ సందర్భంగా ఆశ్రమంలోని నిరాశ్రయులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. వారే స్వయంగా భోజనాలు సిద్ధపరచుకొని ఆశ్రమంలోనికి విచ్చేసి కుటుంబమంతా కలిసి భోజనాలు వడ్డించారు. ఈ సందర్భంగా ఆశ్రమ ఫౌండర్ బత్తల ప్రసాద్ మరియు ఆశ్రమంలోని వృద్ధులు వారి కుటుంబానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వారి చిన్న కుమారుడు వంశీకృష్ణ, బంధుమిత్రులు, నాగ ప్రసాద్, వెంకటేశ్వరరెడ్డి, రామాంజి, శ్రీనివాసులు, రవీందర్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, హమ్మిద్ స్నేహితులు పాల్గొన్నారు.

## ఈ నెల 8న సాధారణ సర్వ సభ్య సమావేశం



యాడికి, జనవరి 5 (అనంత ప్రభ)
యాడికి మండల కేంద్రంలోని ఎంపీడీవో సమావేశ భవనం నందు ఈ నెల 8వ తేదీన సాధారణ సర్వ సభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వీరరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి మండలంలోని అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరై, తమ తమ శాఖలకు సంబంధించిన ప్రగతి వివరాలతో సిద్ధంగా ఉండాలని ఎంపీడీఓ సూచించారు. ఈ సమావేశానికి ప్రజా ప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు పాల్గొనాలని తెలుపుతూ, మండల అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష ఉంటుందని తెలిపారు.

## మన సంస్కృతి ఉ మన భవిష్యత్ ఉ జనవరి 14,15న ధర్మవరంలో ఘనంగా సంక్రాంతి సంబరాలు




ధర్మవరం, జనవరి 5 (అనంత ప్రభ)
మన సంస్కృతి ఉ మన భవిష్యత్ అన్న నినాదంతో, రాష్ట్ర వైద్య ఉ ఆరోగ్య శాఖ మంత్రి గౌరవ సత్యకుమార్ యాదవ్ గారి ఆధ్వర్యంలో ధర్మవరం పట్టణంలో జనవరి 14 మరియు 15 తేదీల్లో గవర్నమెంట్ కాలేజ్ గ్రౌండ్‌లో నిర్వహించనున్న సంక్రాంతి సంబరాలు మన తెలుగు సంస్కృతి, సంప్రదాయాలు, గ్రామీణ క్రీడలు మరియు కళారూపాలకు పునరుజ్జీవనం కలిగించే విధంగా ఉండబోతున్నాయని మంత్రి నియోజకవర్గ ఇన్‌చార్జ్ హరీష్ బాబు తెలిపారు. నేటి తరం మన సంప్రదాయాలను మరచిపోకుండా, వాటి గొప్పతనాన్ని తెలుసుకుని గర్వంగా ముందుకు సాగాలనే ఉద్దేశంతో ఈ ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాన్ని మంత్రి సత్య కుమార్ యాదవ్ గారు, ప్రజలకు అంకితం చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గాలిపటాల పోటీలు, గోలీలు, బొంగరాలు వంటి సంప్రదాయ ఆటలు, జిల్లా కోడి ప్రదర్శనలు, గంగిరెద్దులు, హరిదాసు వంటి ప్రజా కళారూపాలు, ముగ్గుల పోటీలు మరియు పల్లెటూరు ప్రత్యేక పిండి వంటల ప్రదర్శన వంటి కార్యక్రమాలు ప్రజలను ఆకట్టుకునే విధంగా నిర్వహించబడతాయని తెలిపారు. ముఖ్యంగా ముగ్గుల పోటీలకు ప్రథమ బహుమతిగా రూ.25,000, ద్వితీయ బహుమతిగా రూ.15,000, తృతీయ బహుమతిగా రూ.10,000 మరియు పాల్గొనే ప్రతి ఒక్కరికీ బహుమతులు అందజేయనున్నట్టు, అలాగే 120 కిలోల ఇసుక సంచి వెయిట్ లిఫ్ట్ పోటీకి రూ.15,000, రూ.10,000, రూ.5,000 నగదు బహుమతులు, కబడ్డీ పోటీలకు రూ.25,000 మరియు రూ.15,000 నగదు బహుమతులు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనదలచిన 15 సంవత్సరాల పైబడిన వారు ముందుగా నమోదు చేసుకుని తమ ప్రతిభను ప్రదర్శించుకోవాలని, ముగ్గుల పోటీలకు అవసరమైన రంగులు, పిండి పోటీదారులే తీసుకురావాలని హరీష్ బాబు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామీణ క్రీడాకారులు, కళాకారులకు ప్రోత్సాహం లభిస్తుందని, మన సంస్కృతి పునరుద్ధరణకు ఇది ఒక గొప్ప వేదిక అవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. కావున ధర్మవరం పట్టణం మరియు నియోజకవర్గ ప్రజలందరూ కుటుంబ సభ్యులతో కలిసి ఈ సంక్రాంతి సంబరాలలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, మన సంస్కృతిని రాబోయే తరాలకు అందించే ఈ ప్రయత్నానికి తమ వంతు సహకారం అందించాలని హరీష్ బాబు హృదయపూర్వకంగా విజ్ఞప్తి చేశారు.

## శింగనమల మండలం. కేంద్రంలో ఆత్మ రామాయణం విలేకరు కార్యాలయం ప్రెస్ మీట్




శింగనమల, జనవరి 5 (అనంత ప్రభ)
రాయలసీమను ఎడారిగా మార్చే చంద్రబాబుఉ తెలంగాణ రహస్య ఒప్పందాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం.
వైఎస్ఆర్సిపి జిల్లా అధికార ప్రతినిధి ఎన్ వి నారాయణ
సోమవారం మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్బులో నిర్వహించిన పత్రికా సమావేశంలో ఆయన మాట్లాడుతూ....
రాయలసీమలో పుట్టి అదే రాయలసీమకు ద్రోహం చేస్తున్న చంద్రబాబు నాయుడు.
రాయలసీమ అభివృద్ధికి లిఫ్ట్ ఇరిగేషన్ తెచ్చిన ఘనత వైయస్ రాజశేఖర్ రెడ్డిదే.
తండ్రి బాటలోనే రాయలసీమకు మేలు చేసిన నాయకుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి.
రాయలసీమను ఎడారిగా మార్చే కుట్రలో భాగంగానే ముఖ్యమంత్రి చంద్రబాబు, తెలంగాణ ముఖ్యమంత్రి ఈ రహస్య ఒప్పందం.
ఆంధ్రప్రదేశ్‌కు రావాల్సిన నిధులు కూడా ఆపేసిన ఘనత చంద్రబాబుదే.
విభజన సమయంలో పదేళ్ల హక్కులు వద్దన్న చంద్రబాబు ఇప్పుడు మరోసారి రాయలసీమకు అన్యాయం.
ఈ చీకటి ఒప్పందాలను ప్రజల్లోకి తీసుల్లి బట్టబయలు చేస్తాం
రాయలసీమ ప్రజల హక్కుల కోసం వైఎస్సార్‌సీపీ పోరాటం ఆగదని వైఎస్ఆర్సిపి జిల్లా అధికార ప్రతినిధి ఎన్ వి నారాయణ హెచ్చరించారు

## అమరావతి టూ బెంగళూరు జాతీయ ఆర్థిక కారిడార్ గ్రీన్ ఫీల్డ్ హైవే 544జీ నిర్మాణ పనులకు శంకుస్థాపన కార్యక్రమం



పుట్టపర్తి, జనవరి 5 (అనంత ప్రభ)
బెంగళూరు టు విజయవాడ ఆర్థిక కారిడార్ గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణ పనులను పుణె కు చెందిన రాజ్ పత్ ఇన్ ప్రా కాన్ సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ గిన్నిస్ వరల్డ్ రికార్డు ను సొంతం చేసుకొనే పనుల్లో భాగంగా చేపట్టిన ఈగ్రీన్ ఫీల్డ్ హైవే రోడ్డు నిర్మాణ పనుల శంకుస్థాపన కార్యక్రమానికి పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ,మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి సత్యసాయి మేనేజింగ్, ఆర్జే రత్నాకర్ ,రాజ్ పత్ ఇన్ ప్రా కాన్ సంస్థ సిఎండి జగదీష్ కదర్ మోహన్ కథర్ ఆర్యన్ కదర్, ప్రియా కదర్ తోపాటు హైవే అధికారులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముందుగా పేద పండితుల మంత్రోశ్చరణల మధ్య స సంస్థ సిఎండి జగదీష్ కదర్ కుటుంబ సభ్యులు, ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి ,ఆర్ జె రత్నాకర్,లు ప్రత్యేక పూజలు నిర్వహించి పనులు ప్రారంభించారు. ప్రపంచ ఆధ్యాత్మిక కేంద్రమైన పుట్టపర్తి సత్యసాయి జిల్లాలో పుట్టపర్తి మండలం సాధార్లపల్లి వద్ద నుంచి ముదిగుబ్బ మండలం మొలకల వేముల వరకు నిరంతరాయంగా రోడ్డు పనుల నిర్మాణాన్ని చేపట్టే విధంగా సోమవారం ప్రారంభోత్సవ పనులను వారు ప్రారంభించారు. సత్యసాయి బాబా ఆశీస్సులతో పుట్టపర్తి నియోజవర్గం లో ఈ రికార్డు పనులు ప్రారంభం కావడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నానని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పేర్కొన్నారు.సత్యసాయి బాబా 100 వ శత జయంతి వేడుకల సందర్భంగా ఈ గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణ పనులు ఇక్కడ చేపట్టడం ఎంతో అభినందనీయం అన్నారు.ఈ నిర్మాణ పనులు 6లైన్లతో ఇరువైపుల 56 కి.మీ రహదారి పనులు సుమారు 153 కి మీ. ఈనెల 11 లోపు పూర్తి చేసేలా రికార్డు స్థాయిలో పనులు చేపట్టాలని సంస్థ భావించడం ఎంతో అభినందనీయం అన్నారు. గతంలో ఈ సంస్థ ఆధ్వర్యంలో దేశంలో మూడు జాతీయ రహదారి పనులు చేపట్టి గిన్నిస్ రికార్డు సొంతం చేసుకుందని గుర్తు చేశారు. అదే రికార్డును బద్దలు కొట్టడానికి పుట్టపర్తి నియోజకవర్గంలో రాజ్ పత్ ఇన్ ప్రా కాన్ సంస్థ ఈ గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణ పనులు సకాలంలో పూర్తి చేసి ప్రజలకు మంచి రవాణా సౌకర్యాన్ని కల్పించి మరెన్నో పనులు చేపట్టాలని కోరారు. మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ, రాజ్ పత్ ఇన్ ప్రా కాన్ సంస్థ ఆధ్వర్యంలో సత్యసాయి జిల్లా పుట్టపర్తి నియోజవర్గం లో రికార్డు పనులు చేపట్టడం ఎంతో అభినందనీయం అన్నారు. ఈ సంస్థ ఆధ్వర్యంలో సత్యసాయి బాబా 100 వ జయంతి వేడుకల్లో వివిధ అభివృద్ధి పనుల్లో భాగస్వాములు కావడం మళ్లీ ఈరోజు ప్రపంచం గిన్నిస్ ప్రపంచ గిన్నిస్ రికార్డు సాధించేలా బెంగళూరు టు విజయవాడ ఆర్థిక కారిడార్ జాతీయ రహదారి నిర్మాణ పనులు చేపట్టడం అత్యంత గర్వకారణం అన్నారు. ఈ కార్యక్రమంలో రాజ్ పత్ ఇన్ ప్రా కాన్ సంస్థ అధికారులు , జాతీయ రహదారుల కేంద్ర అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు కూటమి పార్టీల నాయకులు సామకోటి ఆదినారాయణ, ఓడి చెరువు మండల కన్వీనర్ శెట్టి వారి జయచంద్ర, ఆమడగూరు మండల కన్వీనర్ గోపాల్ రెడ్డి,రాజారెడ్డి ,గంగాధర్ ,జాకీర్ , రామాంజనేయులు ,శ్రీనివాస్ నాయక్,ఇతర నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు

## అనంత వెంకటరెడ్డికి ఘన నివాళి రోటరీపురంలోని ఘాట్‌లో పుష్పాంజలి



అనంతపురంలో, జనవరి 5 (అనంత ప్రభ)
మాజీ ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ దివంగత అనంత వెంకటరెడ్డికి రాజకీయాలకు అతీతంగా ఘన నివాళి అర్పించారు. సోమవారం అనంత వెంకటరెడ్డి 26వ వర్ధంతి పురస్కరించుకుని ముందుగా అనంతపురంలోని ప్రభుత్వ ఆస్పత్రి ఎదురుగా ఉన్న విగ్రహానికి నివాళి అర్పించారు. ఆస్పత్రి వద్దే అన్నదానం చేపట్టారు. ఆ తర్వాత బుక్కరాయసముద్రం మండలం రోటరీపురం వద్ద ఉన్న అనంత వెంకటరెడ్డి ఘాట్ వద్ద పెద్ద ఎత్తున వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పుష్పాంజలి ఘటించారు. జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చి అనంత వెంకటరెడ్డి జిల్లాకు చేసిన సేవలను స్మరించుకున్నారు

## అంతర్గగంగా లో పొలం పిలుస్తోంది. కార్యక్రమం



కూడేరు, జనవరి 5 (అనంత ప్రభ)
కూడేరు మండల పరిధిలోని అంతరగంగ గ్రామం లో సోమవారం రోజున మండల వ్యవసాయ అధికారి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతులకు రబీ పంట సాగు లో మెలకువలు గురించి తెలియచేయడం జరిగినది. కంది , ఉలవ పంటలల్లో పంటకోత ప్రయోగం చేయబడింది.సూక్ష్మ పోషకాలు మరియు పంట సాగులో వాటి వినియోగ ప్రాముఖ్యత గురించి తెలియజేసారు. సూక్ష్మ పోషకాలు అయిన జిప్సం కూడేరు గోడౌన్ లో ఉంది కావలసిన రైతులు కూడేరు రైతు సేవ కేంద్రం లో సంప్రదించవలసిందిందిగా తెలియచేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఏవో శుభకర్ మరియు గ్రామ ఉద్యాన సహాయకులు రాజకుమార్ , గ్రామ రైతులు పాల్గొన్నారు

## నూతన కమిటీ ఎంపిక




శింగనమల, జనవరి 5 (అనంత ప్రభ)
శింగనమల మండల కేంద్రంలోని శ్రీ ఆత్మ రామాలయం వద్ద ఏర్పాటు చేసుకున్న శ్రీ ఆత్మరామ నూతన విలేకరుల కార్యాలయం నూతన కమిటీ ఎంపిక చేయడం జరిగింది. ఈ కమిటీ ఏకగ్రీవంగా ఎంపిక చేయడం జరిగింది.ప్రెస్ క్లబ్ గౌరవ అధ్యక్షులుగా ఎంపీడీఓ భాస్కర్ ,తహశీల్దార్ శేషారెడ్డి, అధ్యక్షులుగా రా.చంద్రమోహన్ టీవీ 5,ఉపాధ్యక్షులుగా జ.ముత్యాలు అనంత ప్రభ, ప్రధాన కార్యదర్శిగా ఎ.శంకర్ విశాలాంధ్ర, కార్యదర్శిగా దీ.రామాంజనేయులు(రాము యాదవ్ )
మిగతా రిపోర్టర్లు 12మంది కమిటి సభ్యులుగా నియమించడం జరిగింది.నూతన కమిటి సభ్యులకు రిపోర్టర్లు అభినందనలు తెలియజేశారు.

## ఎమ్మెల్యేబండారు శ్రావణి శ్రీ కి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన టిడిపి నాయకులు సుధాకర



శింగనమల, జనవరి 5 (అనంత ప్రభ)
నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని టిడిపి నాయకుడు సుధాకర్ శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ హృదయపూర్వక నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా సుధాకర మాట్లాడుతూ, ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ ఎల్లప్పుడూ మంచి ఆరోగ్యంతో, ఆయురారోగ్యాలతో సుఖసంతోషంగా ఉండాలని ఆకాంక్షంచారు. ఆమె ఆశీస్సులతో ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధించి, శింగనమల నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు నడిపించాలని కోరుకున్నారు.అలాగే నూతన సంవత్సరం శింగనమల నియోజకవర్గ ప్రజల జీవితాల్లో ఆనందం, శాంతి, సంక్షమం నింపాలని, ముఖ్యంగా పేదలు మరియు మధ్యతరగతి ప్రజలకు ప్రభుత్వ సంక్షమ పథకాలు మరింత విస్తృతంగా చేరువ కావాలని తెలిపారు. ప్రజల పక్షన నిలబడి టిడిపి నిరంతరం పోరాటం చేస్తుందని ఆయన స్పష్టం చేశారు

## బాల్య వివాహాలకు అడ్డుకట్టు వేద్దాం, బంగారు భవిష్యత్ తీర్చిదిద్దాం




అనంత, జనవరి 5 (అనంత ప్రభ)
జాతీయ న్యాయ సేవ అధికార సంస్థ న్యూఢిల్లీ వారి ఆదేశాల మేరకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి వారి సూచనల మేరకు అనంతపురం జిల్లా ప్రధాన న్యాయమూర్తి అయిన ఈ. భీమారావు ఆదేశాల మేరకు సోమవారం రోజున ప్రభుత్వ సాంఘిక సంక్షమశాఖ కళాశాల బాలికల వసతిగృహం నందు న్యాయ విజ్ఞాన అవగాహన బాల్య వివాహాల నియంత్రణపై న్యాయ విజ్ఞాన సదస్సు ఏర్పాటు చేయడమైనది. ఎలిమినేటింగ్ చైల్డ్ మ్యారేజెస్ , 2025 లో భాగంగా 100 రోజుల ప్లాన్ ఆఫ్ యాక్షన్ అనగా 17-12-2025 నుండి 27-03-2026 వరకు సంబంధించి అనంతపురం జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి న్.రాజశేఖర్ అనంతపురము లోని ప్రభుత్వ సాంఘిక సంక్షమశాఖ కళాశాల బాలికల వసతిగృహం నందు న్యాయ విజ్ఞాన అవగాహన సదస్సును నిర్వహించారు. ఆడపిల్లలకు చదువు పట్ల జిజ్ఞాసను పెంచి వారి అభివృద్ధిని మరియు హితోదికంగా వారి కుటుంబ శ్రేయస్సును కోరుకుందాం అన్నారు. ఈ బాల్య వివాహాలు అన్న దురాచారం పట్ల అందరూ అవగాహన కలిగి ఇలాంటి వాటి పట్ల జాగరుకతతో ఉండి మెరుగైన సమాజం ఎదుగుదలకు మన వంతు తోడ్పడదాం అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్లు పాల్గొన్నారు

# కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి ,సంక్షమం



పుట్టపర్తి, జనవరి 5 (అనంత ప్రభ)

కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రంలో అభివృద్ధి ,సంక్షమ పథకాలను నిర్విఘ్నంగా కొనసాగిస్తున్నారని పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి పేర్కొన్నారు. నల్ల మాడ మండల కేంద్రంలో రూ. 5.88 కోట్లతో గిరిజన బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాల వసతి గృహ నిర్మాణ పనులకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి తోపాటు మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి,గిరిజన శాఖ జిల్లా అభివృద్ధి అధికారి రాజేంద్రరెడ్డి , స్థానిక సర్పంచ్ భారతి ఛామల నాయక్ హాజరయ్యారు. ముందుగా గిరిజన బాలుర ఆశ్రమ వసతి గృహానికి ఎమ్మెల్యే పల్లె సింధూర ,మాజీ మంత్రి డాక్టర్ రఘునాథరెడ్డి చేతుల మీదుగా భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 18 మాసాల్లోనే కనీ విని ఎరుగని రీతిలో అభివృద్ధి సంక్షమ కార్యక్రమాలు రాష్ట్రంలో అమలు చేశామని గుర్తు చేశారు.వైసీపీ ప్రభుత్వ హయంలో రాష్ట్రంలో కూల్చివేతలు తప్ప చేసిన అభివృద్ధి ఏది లేదన్నారు. వైసిపి హయాంలో పేపర్ల లో మాత్రమే ప్రకటనలు కనిపించాయి తప్ప అభివృద్ధిలో ఏమాత్రం కనిపించలేదన్నారు. ఏపీ అభివృద్ధికి చిరునామా ముఖ్యమంత్రి చంద్రబాబు అని అభివర్ణించారు. రాష్ట్రంలో 67 లక్షల కుటుంబాల విద్యార్థులకు పదివేల కోట్లు తల్లికి వందనం పథకం ద్వారా లబ్ధి చేయకూడదని గుర్తు చేశారు. అంతేకాకుండా అన్నదాత సుఖీభవ పథకం , మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం, పెన్షన్ల పెంపు ,మహిళలకు ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు వంటి పథకాలు ద్వారా ప్రజలకు లబ్ధి చేకూర్తోందని తెలిపారు. పుట్టపర్తి నియోజకవర్గం లో గ్రామాల్లో సిసి రోడ్లతోపాటు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సహకారంతో 35 కోట్లతో రహదారి పనులు మంజూరయ్యాయని తెలిపారు. ఇన్ని పథకాలు అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్న కూటమి ప్రభుత్వానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ఎమ్మెల్యే పల్లె సిందూరారెడ్డి కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా సత్య సాయిబాబా ఆశీస్సులతో పుట్టపర్తి నియోజకవర్గ అభివృద్ధికి ప్రజలు తగిన మద్దతు ఇవ్వాలని ఈ సహకారంతో మరింత ముందుకు వెళ్తానని ఎమ్మెల్యే పల్లె సింధూర పేర్కొన్నారు.

మాజీమంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నల్లమాడ గిరిజన ఆశ్రమ పాఠశాలకు సుమారు రూ. 6 కోట్లు నిధులు మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు మంత్రి సంధ్యారాణికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం విద్యకు అత్యంత ప్రాధాన్యత కల్పిస్తోందనీ అన్నారు. గతంలో నల్లమాడ శాసనసభ్యునిగా ఈ ప్రాంతానికి ఎస్సీ రెసిడెన్షియల్ పాఠశాల తోపాటు ప్రభుత్వ జూనియర్ కళాశాల ,కేజీబీవి ,ప్రభుత్వ కార్యాలయాలు ,గ్రామాలకు త్రాగునీరు,విద్యుత్ ,రోడ్లు వంటి ప్రాజెక్టులు తీసుకొచ్చానని గుర్తు చేశారు. అంతేకాకుండా 2014 నుంచి 19 వరకు ఈ ప్రాంత ఎమ్మెల్యేగా మంత్రిగా మొలకవేమల నుంచి కొక్కంటి క్రాస్ వరకు 74 కోట్లతో రెండు లైన్ల రోడ్లు, పుట్టపర్తి నుంచి నల్ల మాడ మీదుగా కదిరి వరకు రూ. 20 కోట్ల తో రోడ్డు నిర్మాణ పనులు చేపట్టానని తెలిపారు. ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలనే ఆలోచనతో 450 గ్రామాలకు సమగ్ర త్రాగునీటి పథకాన్ని తీసుకొచ్చామని వెల్లడించారు. ప్రస్తుతం ఈ గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలను భవిష్యత్తులో జూనియర్ కళాశాల గా అప్డేట్ చేసేలా సెల్ చూసుకుంటామని వెలాడించారు. అభివృద్ధి చేస్తున్న కూటమి ప్రభుత్వాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబును ప్రజలు గుర్తుపెట్టుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి రాజేంద్ర కుమార్ రెడ్డి, గిరిజన పాఠశాల

ప్రధానోపాధ్యాయులు సతీష్ కుమార్ , మండల తహసీల్దార్ మనోజ్ కుమార్ ఇన్చార్జ్ ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి , శ్రీశైలం ప్రాజెక్ట్ డిఈ రియాజుద్దీన్ , సర్పంచ్ భారతి భాయి,మండల టిడిపి కన్వీనర్ మైలే శంకర్ ,ఓడి చెరువు,ఆమడ గూరు మండలాల కన్వీనర్లు జయచంద్ర గోపాల్ రెడ్డి కూటమి పార్టీల నాయకులు కేశవరెడ్డి బుట్టి నాగభూషణం , అబ్బాస్ ఖాన్ , మణికుమార్ ,మంజునాథ్ రెడ్డి ,రమణ ,రాయుడు తదితరులు పాల్గొన్నారు







# వట్టివేరుతో.. అందాన్ని మెరిపించేయండి..!



వట్టి వేరు... సకల సుగుణాలకూ పెట్టింది పేరు. పురాతన కాలం నుంచి సంప్రదయా ఔషధాలలో వట్టివేరును వాడతారు. వెట్టివేరులో ఐరన్, మాంగనీస్, విటమిన్ బి6 వంటి ఇతర ఖనిజాలు పుష్కలంగా ఉన్నాయి. వేసవి తాపాన్ని తట్టుకోవడానికి, చాలా మంది వట్టివేరు షర్బత్ తాగుతూ ఉంటారు. దీనిలోని ఔషధ గుణాలు శరీరంలో విష వ్యర్థాలను, సూక్ష్మక్రిములను తొలగిస్తుంది. వెట్టివేరు రక్తప్రసరణను పెంచి, బీపీని తగ్గిస్తుంది. వట్టివేరు కేవలం ఆరోగ్య ప్రయోజనాలనే కాదు.. సౌందర్య ప్రయోజనాలను అందిస్తుంది. వట్టివేరులో శీతలీకరణ లక్షణాలు ఉంటాయి. దీనిలోని యాంటీ ఇన్ఫమేటరీ గుణాలు మొటిమలు, అలెర్జీల నుంచి ఉపశమని ఇస్తాయి. వట్టివేరు వల్ల చర్మానికి ఎలాంటి ప్రయోజనాలు ఉంటాయో.. ఈ స్టోరీలో చూద్దాం.

వట్టివేరులో క్యూసిమోల్, వెటివెరోల్స్, ఐసోప్రొపెనిల్, ఫ్లేవనాయిడ్లు, ఫినాల్స్, ఫైటోకెమికల్స్ ఉంటాయి. దీనిలో శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్, యాంటీ ఇన్ఫమేటరీ, యాంటీమైక్రోబయల్ గుణాలు ఉంటాయి. దీనిలో చర్మాన్ని పునరుజ్జీవింపజేసే లక్షణాలు కూడా ఉంటాయి.

చర్మాన్ని మెరిపిస్తుంది..

ఆయుర్వేదంలో చర్మాన్ని ప్రకాశవంతం చేసే మూలికగా.. వట్టివేరును వర్గీకరించారు. వట్టివే-రులోని ఫైటోకెమికల్స్‌కు మెలనోజెనిసిస్‌ను అణిచివేసే సామర్థ్యం ఉంది. మీ స్కిన్ కేర్ రొటీన్‌లో వట్టివేరు, వట్టివేరు నూనె ఉపయోగిస్తే.. డార్క్ స్పాట్స్, మొటిమల మచ్చలు, టాన్ తొలగుతుంది. స్కిన్ టోన్ గణనీయంగా పెరుగుతుంది.

జిడ్డు చర్మం ఉంటే..

హార్మోన్ల అసమతుల్యత సేబాషియస్ గ్రంధుల హైపర్యాక్టివిటీకి, సెబమ్ అధికంగా ఉత్పత్తి కావడానికి కారణం అవుతుంది. దీని వల్ల చర్మం జిడ్డుగా మారి, మొటిమల సమస్యకు దారితీస్తుంది. మీరు జిడ్డు చర్మంతో ఇబ్బంది పడుతుంటే.. వట్టివేరు అద్భుతంగా సహాయపడుతుంది. మీ స్కిన్ కేర్‌లో వట్టివేరు పొడిని యాడ్ చేసుకుంటే.. చర్మ స్రావాలు నియంత్రణలో ఉంటాయి. ఇది చర్మ రంధ్రాలను బిగుతుగా మారుస్తుంది, మొటిమలు రాకుండా రక్షిస్తుంది.

చర్మ ఇన్ఫెక్షన్లకు చెక్..

స్కిన్ ఇన్ఫెక్షన్లకు చికిత్స చేయడానికి వట్టివేరు అద్భుతంగా పనిచేస్తుంది. ఇది బ్యాక్టీరియా, ఫంగల్ ఇన్ఫెక్షన్లను నయం చేస్తుంది. దీనిలోని యాంటీబ్యాక్టీరియల్, యాంటీమైక్రోబయల్ గుణాలు స్టెఫిలోకాకస్ బ్యాక్టీరియాతో పోరాడతాయి. గాయాలు తగిలినప్పుడు.. త్వరగా నయం చేస్తుంది. ప్యూరెంట్ పుండ్లు చికిత్సలో దీన్ని ఉపయోగిస్తారు.

మొటిమలకు చెక్..

వట్టివేరు మొటిమలను తగ్గించడానికి సహాయపడుతుంది. ఇందులోని యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు రంధ్రాలలో బ్యాక్టీరియా వృద్ధిని నిరోధిస్తాయి. సెబమ్ స్రావాన్ని నియంత్రించి, మొటిమలను నివారిస్తాయి. మీ బ్యూటీ ప్యాక్స్‌లో వట్టివేరు పొడి యాడ్ చేసుకుంటే మంచి రిజల్ట్ ఉంటాయి.

# పచ్చి మామిడి తింటే గుండెకి మంచిదా..

మామిడిపండ్ల సీజన్ వచ్చేసింది. అందరూ వీటిని హ్యాపీగా తింటూ ఎంజాయ్ చేస్తున్నారు. అయితే, కాయల్ని తినడం కూడా చాలా బెనిఫిట్స్ ఉంటాయ్. పచ్చిమామిడి కాయల్లో పోషకాలు, విటమిన్లు, ఖనిజాలు, డైటరీ ఫైబర్, కెరోటినాయిడ్స్ ఉంటాయి. ఇవన్నీ కూడా ఆరోగ్యానికి మంచివి.



జీర్ణక్రియ..

పచ్చి మామిడి, వివిధ జీర్ణ ఎంజైమ్స్ స్రవించడానికి ప్రేగులను ప్రేరేపిస్తుంది. దీనిని తినడం వల్ల అసిడిటీ, అజీర్ణం, మలబద్ధకం, మార్నింగ్ సిక్‌నెస్ వంటి జీర్ణ సమస్యల్ని దూరం చేస్తుంది. వీటిని తినడం వల్ల వడదెబ్బ నుంచి కాపాడుకోవచ్చు. దీనిని తీసుకోవడం వల్ల హైడ్రేషన్ కూడా అందుతుంది.

ఏయే విటమిన్స్..

పచ్చి మామిడిలో విటమిన్ ఎ, సి, ఇలు పుష్కలంగా ఉంటాయి. ఇవన్నీ కూడా ఇమ్యూనిటీని పెంచుతుంది. చిగుళ్ళ సమస్యల్ని దూరం చేస్తాయి. అంతేనా, వీటిని తీసుకోవడం వల్ల తెల్ల రక్తకణాలు పెరిగి వ్యాధులతో పోరాడే బలాన్నిస్తుంది.



గుండెకి చాలా మంచిది..

పచ్చి మామిడి పండ్లలో మాంగిఫెరిన్ కంటెంట్, ట్రైగ్లిజరైడ్స్, కొలెస్ట్రాల్ సా-యిలు, ఫ్యాటీ యాసిడ్ స్థాయిలను బ్యాలెన్స్ చేస్తుంది. దీంతో గుండె జబ్బుల ముప్పు తగ్గుతుంది. మామిడి పండ్లలో మెగ్నీషియం, పొటాషియం కూడా ఉన్నాయి. అందుకే వీటిని తినడం వల్ల గుండె ఆరోగ్యం బాగుంటుంది.

చర్మం, జుట్టుకి మంచిది..

నిజానికి మామిడిలో కొల్లాజెన్ శాతం ఉంటుంది. ఇది చర్మ ఆరోగ్యానికి చాలా మంచిది. అంతే కాదు. దీనిని తీసుకోవడం వల్ల జుట్టు సమస్యలు దూరమై ఆరోగ్యంగా పెరుగుతుంది.

ఇమ్యూనిటీ..

పచ్చి మామిడిలో ఇమ్యూనిటీ పెంచే గుణాలు ఉంటాయి. ఇవి మనల్ని జబ్బుల నుంచి కాపాడతాయి. కొన్ని అధ్యయనాల ప్రకారం.. ఓ కప్పు పచ్చి మామిడి రసంలో విటమిన్ ఎ , విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. ఇవన్నీ కూడా ఆరోగ్యానికి చాలా మంచివి.

# వేసవిలో ఈ జ్యూస్ తాగితే ఒంట్లో వేడి పోయి.. రీఫ్రెష్ అవుతుంది..!



ఆధ్యాత్మికంగానూ, ఔషధగుణాలపరంగానూ మారేడు వృక్షానికి ఎంతో ప్రత్యేకత ఉంది. మారేడు పండ్లు, కాయలు, బెరడు, ఆకులు, పువ్వులు ఇలా అన్నీ ఔషధాల్లో ఉపయోగపడేవే. వేసవి కాలంలో మనం మారేడు కాయల గురించి ప్రత్యేకకంగా చెప్పుకోవాలి. మారేడు కాయను ఇండియన్ క్విన్స్, గోల్డెన్ యాపిల్, స్టోన్ యాపిల్, వుడ్ యాపిల్ అని కూడా పిలుస్తారు. ఈ పండ్లను జామ్స్, జెల్లీలు, శీతలపానీయాలు, జ్యూస్, షర్బత్ తయారు చేసుకుంటూ ఉంటారు. వేసవికాలంలో మారేడు పండ్లు తినడం, జ్యూస్ తాగడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి.. ఆయుర్వేద నిపుణుడు డాక్టర్ అబ్రార్ ముల్తానీ మనకు వివరించారు.

ఈ పోషకాలు ఉంటాయి..

మారేడు పండు పోషకాల స్టోర్ హౌస్ అని చెప్పొచ్చు. దీనిలో ప్రొటీన్లు, ఫైబర్, కాల్షియం, పొటాషియం, ఐరన్ విటమిన్ ఏ, సి, బి1, బి2 వంటి పోషకాలు ఉంటాయి.

బెస్ట్ సమ్మర్ డ్రింక్..

మారేడు జ్యూస్ సమ్మర్ బెస్ట్ డ్రింక్ అని డాక్టర్ అబ్రార్ అన్నారు. ఇది శరీరానికి చల్లదనంతోపాటు ఫ్రెష్‌నెస్ ఇస్తుంది. వేసవిలో ఈ పండు రసం తాగితే చాలా మంచిది. ఈ జ్యూస్ తాగితే.. ఒంట్లో వేడి పోవడంతో పాటు తక్షణశక్తి వస్తుంది. ఇది ఎండ వాతావరణానికి టానిక్‌గా పని చేస్తుంది.

జీర్ణక్రియకు మేలు చేస్తుంది..

మా రేడు పండ్ల రసం ఎముకల ఆరోగ్యానికి మేలు చేస్తుంది. మారేడు పండులోని కాల్షియం ఎముకలు, దంతాలు బలంగా ఉండేలా తోడ్పడుతుంది. మారేడు పండ్ల రసం తక్షణ శక్తిని ఇస్తుంది. రక్తహీనత దూరం అవుతుంది..

రక్తహీనత దూరం అవుతుంది..

మారేడు పండ్ల రసంలో విటమిన్ %దీ%2 ఉంటుంది. ఇది ఎర్ర రక్త కణాల ఉత్పత్తికి సహాయపడుతుంది. రోజూ మారేడు పండ్ల జ్యూస్ తాగితే రక్తలేమి దూరం అవుతుంది.

జ్యూస్ ఇలా తయారు చేసుకోండి..

జ్యూస్ ఇలా తయారు చేసుకోండి..

పండిన మారేడు - ఒకటి, బెల్లం - రుచికి సరిపడా, దాల్చిన చెక్కపొడి - పావు టీస్పూను, జాజికాయ పొడి - పావు టీస్పూను, చల్లటి నీళ్లు -జ్యూస్‌కు సరిపడా.

ముందుగా మారేడు పండును పగులకొట్టి లోపలి గుజ్జును వేరుచేయాలి. ఈ గుజ్జును మిక్సీ జార్‌లో వేసి సరిపడా నీళ్లు పోసి బ్లెండ్ చేయండి. దీన్ని వడపోసి సరిపడా బెల్లం వేసుకోవాలి. చివరిగా దీనిలో దాల్చిన చెక్క, జాజికాయ పొడివేసుకుని జ్యూస్ ఎంజాయ్ చేయండి.

AP 4PG 6 - 1- 2026 TUESDAY qxp_Layout 1 06-01-2026 05:41 AM Page 4



# 250 ఏళ్ల కంపెనీకి బ్రాండ్ అంబాసిడర్‌గా శ్రీలీల.. రెమ్యునరేషన్ ఎన్ని కోట్లంటే?




కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన మైసూర్ శాండల్ సోప్‌కు స్టార్ హీరోయిన్ తమన్నా భాటియాను బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించడంపై కన్నడ సీమ రగిలిపోతోన్న సంగతి తెలిసిందే. దాదాపు 6.2 కోట్ల పారితోషికంతో తమన్నాకు ఈ బాధ్యతను కట్టబెట్టింది సిద్ధరామయ్య ప్రభుత్వం. అయితే కర్ణాటకలో ఎంతో మంది ప్రముఖులు, ప్రతిభావంతులు ఉండగా పరాయి రాష్ట్రానికి చెందిన నటిని మైసూర్ శాండల్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించడం వివాదానికి దారి తీసింది. కర్ణాటక సంఘాలు, పార్టీలు, ప్రముఖులు ప్రభుత్వ తీరును తప్పుబడుతున్నారు. ఈ క్రమంలో కర్ణాటకకి చెందిన యువ కథానాయిక శ్రీలీల అదిరిపోయే ఆఫర్ అందుకున్నారు. ఈ వివరాల్లోకి వెళితే..

చేతినిండా సినిమాలతో శ్రీలీల బిజీ ప్రస్తుతం టాలీవుడ్‌లో బిజీగా ఉన్న హీరోయిన్ ఎవరంటే ఖచ్చితంగా వినిపించే పేరు శ్రీలీల. ధమాకాతో లైమ్ లైట్‌లోకి వచ్చిన ఈ ముద్దగుమ్మ ఆ తర్వాత భగవంత్ కేసరి, గుంటూరు కారం వంటి భారీ బడ్జెట్ సినిమాల్లో అవకాశాలు దక్కించుకుంది. ఇక పుష్ప 2లో కిస్సిక్ సాంగ్‌తో దేశాన్ని ఊపేసి నేషనల్ వైడ్ పాపులర్ అయ్యింది. అందం, అభినయం, డ్యాన్స్‌తో క్రేజీ ఆఫర్లు పట్టేస్తోంది. చాలా చిన్న వయసులోనే బాలీవుడ్ ఆఫర్ కూడా అందుకోవడంతో శ్రీలీల అదృష్టంపై సీనియర్ హీరోయిన్లు, అప్ కమింగ్ హీరోయిన్లు అసూయ పడుతున్నారు. ఏళ్లుగా నిరీక్షిస్తున్న తమ వల్ల కానిది శ్రీలీల ఈజీగా సాధిస్తోందని కుళ్లుకుంటున్నారు.

ఆషికి 3తో బాలీవుడ్‌లోకి బాలీవుడ్ స్టార్ హీరో కార్తీక్ ఆర్యన్ సరసన ఆషికి 3 అనే సినిమా ద్వారా బాలీవుడ్‌లో అడుగుపెడుతున్నారు శ్రీలీల. అనురాగ్ బసు ఈ చిత్రానికి దర్శకుడు. దీపావళి కానుకగా ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ భావిస్తున్నారు. దీనిలో భాగంగా శరవేగంగా సినిమాను పరుగులు పెట్టిస్తున్నాడు అనురాగ్. అయితే అషికి 3 ఇంకా సెట్స్ మీద ఉండగానే శ్రీలీల హిందీలో మరో ఆఫర్ అందుకున్నట్లుగా వార్తలు వస్తున్నాయి. మరో స్టార్ హీరో సిద్ధార్థ్ మల్హోత్రా సరసన శ్రీలీల ఆడిపడనుందట. ఆనంద్ ఎల్ రాయ్ ఈ సినిమాను నిర్మిస్తుండగా.. రాజ్ సాండియాలా దర్శకత్వం వహిస్తారని బీటౌన్ టాక్. అయితే దీనిపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. ఇక తెలుగులో జూనియర్, మాస్ జాతర, లెనిన్, తమిళంలో పరాశక్తి సినిమాలలో శ్రీలీల నటిస్తున్నారు.

టాప్ బ్రాండ్స్‌కు అంబాసిడర్‌గా సినిమా హిట్, ఫ్లాపులతో సంబంధం లేకుండా శ్రీలీల వరుస అవకాశాలు అందుకుంటున్నారు. ఇక బ్రాండ్ అండార్స్‌మెంట్స్‌తోనూ ఈ ముద్దుగుమ్మ భారీగా సంపాదిస్తోందట. న్యూడ్ స్కిన్ కేర్, అమృత గ్రూప్, ప్రెస్టా వుమెన్స్ వేర్, నీరూస్ తదితర బ్రాండ్స్‌కు శ్రీలీల అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్నారు. తాజాగా శ్రీలీల అండార్స్‌మెంట్స్ కెరీర్‌లోనే మైల్ స్టోన్ అనదగ్గ ఆఫర్ వచ్చింది.

శ్రీలీలతో యూకే కంపెనీ డీల్ పర్సనల్ కేర్, కాస్మోటిక్స్, ఫ్రాగ్‌రెన్సెస్ విభాగంలో ప్రపంచంలోని అగ్రగామి సంస్థల్లో ఒకటైన యార్డ్లే లండన్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా ఎంపికయ్యారు. లండన్ కేంద్రంగా పనిచేస్తున్న ఈ కంపెనీకి దాదాపు 255 ఏళ్ల చరిత్ర ఉండగా.. ప్రపంచంలోని అత్యంత పురాతన కంపెనీల్లో ఒకటిగా యార్డ్లేకు పేరుంది. 2009లో యార్డ్లేను భారత కార్పోరేట్ దిగ్గజం విప్రో ఎంటర్‌ప్రైజెస్ కొనుగోలు చేసింది. ఇంతటి చరిత్ర కలిగిన ఈ సంస్థలోని ఫ్రాగ్‌రెన్సెస్ విభాగానికి గాను భారత్‌లో శ్రీలీల ప్రమోట్ చేయనుండటం విశేషం.

పారితోషికం ఎంతంటే? అయితే ఇందుకు గాను శ్రీలీల ఎంత మొత్తంలో పారితోషికం అందుకుంటున్నారన్నది తెలియరాలేదు. ప్రస్తుతం బ్రాండ్ ప్రమోషనింగ్ కోసం రూ.50 లక్షల నుంచి రూ.75 లక్షల మధ్య శ్రీలీల ఛార్జ్ చేస్తుండటంతో ఇది కూడా అదే స్థాయిలో లేదా ఆపైనా ఉండే అవకాశం ఉందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. యార్డ్లే నుంచి శ్రీలీల పారితోషికంగా ఎంత మొత్తం వసూలు చేస్తున్నారనే దానిపై త్వరలోనే మరిన్ని వివరాలు తెలిసే అవకాశం ఉంది.




# చిరంజీవికి అలా.. బాలయ్యకు ఇలానా? అల్లు అరవింద్‌నే అడగండి..



మెగా ఫ్యామిలీ, అల్లు కుటుంబానికి మధ్య విభేదాలు తారాస్థాయికి చేరుకొన్నాయనే విషయాల గురించి మీడియాలో ఎక్కువగా చర్చ జరుగుతున్నది. ఈ రెండు కుటుంబాలు నర్మగర్భంగా మాట్లాడే తీరు ఆ వివాదాస్పద అంశానికి బలం చేకూరేలా కనిపిస్తుంటుంది. అయితే సాధారణ ప్రజలకు ఆ కుటుంబాల మధ్య గతంలో ఉన్న సఖ్యత, బంధాలు లేవనే అపోహ మాత్రం ఏర్పడింది. అయితే ఈ విషయాలపై రెండు కుటుంబాలకు ఆప్తుడైన తండేల్ నిర్మాత బన్నీ వాసు వెల్లడించిన వివరాల్లోకి వెళితే..

ఇటీవల కాలంలో అల్లు ఫ్యామిలీకి నందమూరి బాలకృష్ణ అత్యంత చేరువైనట్టు బయట వాళ్లకే కాకుండా సినిమా వర్గాలకు అనిపిస్తుంది. అయితే ఈ క్రమంలో బాలయ్యకు పద్మభూషణ్ అవార్డు రావడంపై అన్ని వర్గాల నుంచి స్పందన వ్యక్తమైంది. అయితే సినీ పరిశ్రమ ఈ సందర్భాన్ని పురస్కరించుకొని భారీ సమావేశాన్ని ఏర్పాటు చేసి.. ఆయనకు సన్మానం చేయాలనే ఆలోచనలో సినిమా పరిశ్రమ ఉందనే వార్త ఫిలిం నగర్‌లో చక్కర్లు కొడుతున్నది.

అయితే బన్నీ వాసును ఈ విషయంపై మెగాస్టార్ చిరంజీవికి పద్మభూషణ్ వస్తే ఎలాంటి సన్మానం చేయలేదు. మెగా హీరోలు, మెగా కుటుంబం పెద్దది అనే ఫీలింగ్ ఇండస్ట్రీలో ఉంది. ఆ సన్మాన కార్యక్రమాన్ని ఎందుకు నిర్వహించలేదని మీడియా అడిగిన ఓ ప్రశ్నకు ఆయన సరైన రీతిలో స్పందించారు.

పద్మ భూషణ్ అవార్డు అందుకొన్నందుకు చిరంజీవికి సన్మానం చేయకపోవడం.. బాలకృష్ణకు చేయాలనే ప్లాన్ చేయడం లాంటి విషయాలను అరవింద్ గారి లాంటి పెద్ద వాళ్లను అడిగితే బాగుంటుంది. అది చాలా పెద్ద విషయం. నా వయసుకు, నా స్థాయికి మాట్లాడే విషయం కాదు. అరవింద్ గారినే అడిగితే మంచిది. ఈ పరిస్థితుల్లో నేను ఏం మాట్లాడినా బాగుండదు. ఆ విషయం గురించి నేను మాట్లాడితే కరెక్ట్ కాదు అంటూ బన్నీ వాసు తప్పించుకొన్నారు.

నంద్యాల వివాదం తర్వాత నాకు, పవన్ కల్యాణ్‌కు మధ్య గ్యాప్ వచ్చిందనే విషయం సరికాదు. అందులో వాస్తవం లేదు. పవన్ కల్యాణ్ మెచ్యూరిటీ లెవెల్స్ వేరేగా ఉంటాయి. ఆయన ఇలాంటి విషయాలను మనసులో పెట్టుకోని చూడరు. ఎవరు ఏం చేస్తున్నారు? ఎవరు ఎలాంటి వారు? అనేది ఆయనకు ఫుల్లుగా క్లారిటీ ఉంది. నా విషయంలో ఆయన బన్నీతో కలిపి చూడరు.పార్టీకి ఏం చేస్తున్నాను? పార్టీ కోసం ఎలా ఉంటున్నారనేది ఆయన చూస్తారు అని బన్నీ వాసు వివరణ ఇచ్చారు.

# మహేష్ బాబు వదిలేసిన 1800 కోట్ల సినిమా.. థియేటర్లు బద్దలయ్యేవి.. ఆ మూవీ ఏంటంటే?




సూపర్ స్టార్ మహేష్ బాబు ప్రస్తుతం ఇండియాస్ బిగ్గెస్ట్ డైరెక్టర్ ఎస్ఎస్ రాజమౌళి దర్శకత్వంలో నటిస్తున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం హైదరాబాద్ లోనే మూడవ షెడ్యూల్ జరుగుతోంది. చిత్రీకరణ విషయంలో మాత్రం జక్కన్న ఎస్. ఎస్. ఎం.బి 29 సినిమాను శరవేగంగా కొనసాగిస్తున్నారు. బాలీవుడ్ స్టార్ బ్యూటీ ప్రియాంక చోప్రా హీరోయిన్ గా నటిస్తున్న విషయం తెలిసిందే. మలయాళం సూపర్ స్టార్ పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్రలో నటిస్తున్నారని తెలుస్తోంది. ఇదిలా ఉంటే మహేష్ బాబు చివరిగా గుంటూరు కారం చిత్రంతో ప్రేక్షకులను అలరించిన సంగతి తెలిసిందే. అది సూపర్ స్టార్ మహేష్ బాబు ఇప్పటివరకు రెగ్యులర్ క్యారెక్టర్లలోనే నటిస్తూ వచ్చారు. కానీ అభిమానులు మాత్రం ఆయనను పవర్ఫుల్ రోల్స్ లో చూడాలని ఎంతగానో ఆశిస్తున్నారు. ఈ క్రమంలోనే మహేష్ బాబు వదిలేసుకున్న 1870 కోట్ల సినిమా గురించి తాజాగా న్యూస్ బయటకు వచ్చింది. ఆ సినిమా చేసి ఉంటే మాత్రం మహేష్ బాబు ఇండియా ను షేక్ చేసే వారిని సినీ ప్రముఖులు అభిప్రాయపడుతున్నారు.

ఇంతకీ ఆ సినిమా ఏంటో తెలిస్తే అందరూ షాక్ అవ్వాల్సిందే. క్రియేటివ్ డైరెక్టర్ సుకుమార్, ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ కాంబినేషన్లో వచ్చిన పుష్ప చిత్రమే కావడం విశేషం. అయితే ఈ సినిమాకు మొదట హీరోగా మహేష్ బాబు అని అనుకున్నట్టుగా ఇప్పుడు తెలుస్తోంది. కానీ మహేష్ బాబు ఆ సినిమాలు వదులుకోవడంతో అల్లు అర్జున్ వద్దకు వెళ్లిందని ఫిల్మ్ సర్కిల్స్ లో గుసగుసలు నడుస్తున్నాయి. ఇక అల్లు అర్జున్ టెర్రిఫిక్ పెర్ఫార్మెన్స్ తో పుష్ప, పుష్ప 2 చిత్రాలు ఎంతటి సెన్సేషన్ క్రియేట్ చేశాయో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు.

రీసెంట్ గా వచ్చిన పుష్ప 2 చిత్రం ఏకంగా బాక్సాఫీస్ రికార్డులను తిరగరాసింది. 1870 కోట్లు గ్రాస్ కలెక్ట్ చేసి ఇండియాలోనే హైయెస్ట్ గ్రాస్ కలెక్ట్ చేసిన రెండవ సినిమాగా రికార్డు సెట్ చేసింది. బాహుబలి 2 సాధించిన బాక్సాఫీస్ కలెక్షన్లు 1810 కోట్లను దాటేసి మరి ఈ రికార్డును సెట్ చేయడం సెన్సేషన్ గా మారింది. మన వైపు అల్లు అర్జున్ కు పుష్ప పాత్రలో నటించినందుకు ఏకంగా బెస్ట్ యాక్టర్ విభాగంలో నేషనల్ అవార్డు వరించిన సంగతి తెలిసిందే. ఇక నెక్స్ట్ పుష్ప 3 కూడా రాబోతుంది. ఆ పార్ట్ లో విజయ్ దేవరకొండ నటిస్తారని తెలుస్తోంది.

అయితే ఇంతటి సెన్సేషన్ క్రియేట్ చేసిన పుష్ప చిత్రాన్ని మహేష్ బాబు ఎందుకు వదులుకున్నారా అన్నది ఇప్పుడు మిలియన్ డాలర్ క్వశ్చన్ గా మారింది. అయితే పుష్ప చిత్రం ప్రారంభానికి ముందు మహేష్ బాబు ఇంట్లో వరుసగా విషాదాలు నెలకొనడం, గుంటూరు కారం చిత్రం తర్వాత ఎస్ఎస్ రాజమౌళి తో సినిమాకు కమిట్ అవ్వడమే కారణం అని తెలుస్తుంది. ఇక పుష్ప చిత్రమే కాదు, శంభాజీ మహారాజ్ జీవిత కథతో వచ్చిన చావా చిత్రాన్ని కూడా మహేష్ బాబు వదిలేసారంట. ఈ హిస్టారికల్ ఫిలిం లో మహేష్ బాబు నటించిన మాత్రం మరింత బీభత్సం సృష్టించే వారిని ఫ్యాన్స్ అభిప్రాయపడ్డారు. ఇలా తన ముందుకు వచ్చిన రెండు బ్లాక్ బస్టర్ మూవీస్ ను మహేష్ బాబు వదులుకోవడం ఆసక్తికరంగా మారింది. ఎస్. ఎస్. ఎం.బి 29 తో మాత్రం ఇండియన్ బాక్సాఫీస్ రికార్డులను చెల్లాచెదురు చేస్తారని ఫ్యాన్స్ నమ్ముతున్నారు. ఆ ప్రాజెక్టుకు మార్కెట్లోనూ భారీ డిమాండ్ ఉండింది.

# భైరవం మూవీ రివ్యూ అండ్ రేటింగ్

వీపురంలో జమీందార్ వంశానికి చెందిన గజపతి (మనోజ్ మంచు)కి గ్రామంలో పేరు ప్రతిష్టలు ఉన్నప్పటికీ.. పేదరికం వెంటాడుతుంటుంది. గజపతికి తన ఊరిలోనే పెద్దరికాన్ని ప్రదర్శించే వరద (నారా రోహిత్), అనాథగా బతికే శ్రీను (బెల్లంకొండ శ్రీను) ప్రాణస్నేహితులుగా ఉంటారు. ఇదిలా ఉండగా, ఆ గ్రామంలోని ఆలయ ధర్మకర్తగా గజపతి నానమ్మ (జయసుధ) ఉంటారు. ఆలయ భూములు కాజేయడానికి మంత్రి (శరత్ లోహితస్య) పన్నాగం పన్నుతాడు.

అనాథ అయినప్పటికీ శ్రీనును కన్నబిడ్డగా ప్రజలు ఎందుకు చూస్తారు? శ్రీనుతో వెన్నెల (అదితి శంకర) లవ్ ట్రాక్ ఎలా సాగింది? గజపతిని భార్య నీలిమ (ఆనంది) ఎలా వేధించింది. భార్య ఒత్తిళ్లకు గజపతి తన మనసును ఎలా మార్చుకొన్నాడు. ప్రాణస్నేహితులుగా ఉండే గజపతి, వరద, శ్రీను మధ్య మంత్రి ఎలా చిచ్చు పెట్టారు. వరద స్నేహం కోసం ప్రాణాలిచ్చేంత ప్రేమ ఉన్న గజపతి తన స్నేహితులకు ఎందుకు ఎదురు తిరిగాడు? వరద, గజపతి, శ్రీను మధ్య విభేదాలు ఎలాంటి పరిస్థితులకు దారి తీశాయి? అనే ప్రశ్నలకు సమాధానమే భైరవం సినిమా కథ.

పోలీస్ ఇన్స్‌పెక్టర్ (సంపత్ రాజ్) తన ఉద్యోగానికి రాజీనామాను పై అధికారికి సమర్పించడంతో సినిమా హై నోట్‌లో మొదలవుతుంది. తన రాజీనామాకు కారణం చెప్పడం మొదలు పెట్టడంతో దేవీపురంలో ముగ్గురు ప్రాణ స్నేహితుల కథను ఎమోషనల్‌గా దర్శకుడు ప్రారంభించాడు. ముగ్గురు హీరోల ఇంట్రడక్షన్, ఎలివేషన్స్‌ను బాగానే డిజైన్ చేశాడు. ఆ తర్వాత శ్రీను ప్రేమ కథ, వరద, గజపతి ఫ్యామిలీ మధ్య ఉండే అన్యోన్యతను, కథను ఎస్టాబ్లిష్ చేయడానికి కాస్త టైమ్ ఎక్కువగా తీసుకొన్నట్టు అనిపిస్తుంది. ఫస్టాఫ్‌ను రెగ్యులర్, రొటీన్ ఫార్మాట్‌తో నడిపించినప్పటికి.. ఇంటర్వెల్ ముందు పవర్‌ఫుల్ ఎపిసోడ్‌తో తొలిభాగాన్ని ముగించి సెకండాఫ్‌పై ఆసక్తిని పెంచాడు.

అయితే ముగ్గురు హీరోల మధ్య ఎమోషన్స్, బాండింగ్‌ను బలంగా ఎస్టాబ్లిష్ చేయాల్సి ఉన్నప్పటికీ.. ఆ దిశగా ప్రయత్నం సరిగా చేయలేదనే ఫీలింగ్ కలుగుతుంది. భావోద్వేగంతో చెప్పాల్సిన సన్నివేశాల్లో యాక్షన్ నింపడం వల్ల సినిమాలో సోల్ కాస్త మిస్ అయిందనిపిస్తుంది. ఇలాంటి లోపాలు ఉన్నప్పటికీ.. మామిడితోట సీన్ నుంచి మూవీలో సన్నివేశాలు నెక్స్ట్ రేంజ్‌లోకి వెళ్తాయి. క్లైమాక్స్ సన్నివేశాలను చిత్రీకరించిన తీరు విజయ్ కనకమేడల ప్రతిభ ఎంతో తెలుస్తుంది. సెకండాఫ్‌ను ఇంకాస్త బెటర్‌గా డిజైన్ చేయాల్సిందనే ఫీలింగ్ కలుగుతుంది. నటీనటుల ఫెర్ఫార్మెన్స్ విషయానికి వస్తే.. బెల్లంకొండ శ్రీనివాస్ ఈ సినిమాకు బ్యాక్ బోన్‌గా నిలిచాడు. సినిమాలోని ఎమోషనల్ కంటెంట్‌ను తన పాత్ర ద్వారా బాగా ఎలివేట్ చేశాడు. నటుడిగా మరింత మెచ్యూరిటీని చూపించాడు. ప్రీ క్లైమాక్స్ నుంచి క్లైమాక్స్ సన్నివేశాల్లో తనలోని నట విశ్వరూపాన్ని చూపించే ప్రయత్నం చేశాడు. నారా రోహిత్, మనోజ్‌తో పాత్రలతో మమేకమై మంచి బాండింగ్‌ను ఆన్ స్క్రీన్‌పై ఎలివేట్ చేశాడు. ఇక మనోజ్ మంచు నటుడిగా మరో రేంజ్ పెర్ఫార్మెన్స్ చేశాడు. కాస్త విరామం తీసుకొన్నప్పటికీ.. సూపర్ క్యారెక్టర్‌తో రీ ఎంట్రీతో అదరగొట్టాడు. ఇండస్ట్రీలో తన టైమ్ స్టార్ట్ అయిందని గజపతి పాత్ర ద్వారా చాటి చెప్పాడు. నారా రోహిత్ విషయానికి వస్తే.. వరద పాత్రలో హుందాగా కనిపించాడు. తన పాత్రకు ఎంత ఎమోషన్ కావాలి? ఎంత యాక్షన్ కావాలో అంతే సమతుల్యాన్ని పాటించి సటిల్‌గా స్క్రీన్ పై కనిపించాడు. ఇక నాన్నమ్మగా జయసుధ పాత్ర అంతంత మాత్రమేగానే ఉన్నప్పటికీ.. స్క్రీన్ మీద కనిపించినంత సేపు ఆమె ప్రజెన్స్ బాగుంది. ఈ సినిమా కథను నడిపించే పాత్రలో నీలిమగా ఆనంది నటన బాగుంది. కేవలం గ్లామర్ పరంగానే కాకుండా ఆనంది పాత్రల స్వరూపాన్ని, సినిమా కథ దిశను మార్చే పాత్రలో ఒదిగిపోయింది. ఇక నారా రోహిత్ భార్య పాత్రలో పూర్ణిమగా దివ్య పిళ్లై ఎమోషనల్ కంటెంట్‌ను సినిమాకు అందించే విధంగా పెర్ఫార్మ్ చేశారు. వెన్నెల కిషోర్ కామెడీ పెద్దగా వర్క్ కాలేదు. సంపత్ రాజ్, శరత్, అజయ్, ఇతర పాత్రలు సినిమాలో గుర్తుంచుకొనే పాత్రల్లో కనిపించారు.

టెక్నికల్ అంశాల విషయానికి వస్తే.. ఈ సినిమాకు శ్రీ చరణ్ పాకాల మ్యూజిక్ ప్రధానమైన బలంగా మారింది. బ్యాక్ గ్రౌండ్ స్కోర్‌తోనే కాకుండా హీరోల ఇంట్రడక్షన్ సాంగ్ సంక్రాతి పాట, అలాగే వెన్నెల, గిచ్చు గిచ్చు సాంగ్ ఆడియో పరంగా ఫుల్ జోష్‌ను కలిగిస్తే.. తెర మీద అదే జోష్‌ను చూపించారు. ఇక ఈ సినిమాలో మంచి మాస్ యాక్షన్ ఎపిసోడ్స్ ఉన్నాయి. వాటితో గ్రామంలోని వాతవరణాన్ని హరి కె వేదాంతం చక్కగా, చాలా సహజంగా చిత్రీకరించాడు. కేకే రాధామోహన్ ఈ మూవీని రాజీ లేకుండా మంచి క్వాలిటీతో సినిమాను అందించారు. ప్రొడక్షన్ వాల్యూస్ హై స్టాండర్డ్‌లో ఉన్నాయి. కంటెంట్‌పై మరింత దృష్టిపెట్టి ఉంటే బెస్ట్ మాస్ యాక్షన్ మూవీ అయి ఉండేదనిపిస్తుంది. తమిళంలో సూపర్ హిట్ అయిన గరుడన్ సినిమాకు భైరవం రీమేక్. ఈ సినిమాలో అన్ని రకాలు ఎమోషన్స్ ఉంటాయి. కొన్ని చోట్ల భావోద్వేగాలు లోపించాయి. యాక్షన్ పార్ట్ సినిమా ఫ్లేవర్‌ను మార్చేసింది. పాటల బాగున్నప్పటికీ వాటి ప్లేస్‌మెంట్ సరిగా లేకపోవడం వల్ల మంచి ఫ్లోలో వెలుతున్న స్టోరికి బ్రేకులు వేశాయా? అనిపిస్తుంది. ఈ సినిమా పక్కా మాస్ ఎంటర్‌టైనర్. బెల్లంకొండ శ్రీను, నారా రోహిత్, మనోజ్ మంచు ఫెర్ఫార్మెన్స్ ఈ సినిమాకు హైలెట్. కథ పరంగా పాత కథే.. కాకపోతే డిఫరెంట్‌గా చేయాలన్న ప్రయత్నం కొంత ట్రాక్ తప్పింది. టోటల్‌గా ఈ సినిమాను థియేటర్‌లో ఓసారి చూసేయొచ్చు అనేది నా అభిప్రాయం.




PRINTED, PUBLISHED & and OWNED by T VIJAYANAND, And PRINTED at M/S JBN PUBLICATIONS, # 2/381-A - RAGITHOTA PALEM, Near SHALOM CHURCH, Tadipatri - 515411 Anantapuram District, Andra Pradesh. Published at M/S JBN PUBLICATIONS, # 2/381-A, RAGITHOTA PALEM, Near SHALOM CHURCH, Tadipatri - 515411 Anantapuram District, Andra Pradesh. PIN - 515411. Editor T VIJAYANAND, RNI NO: APTEL/2015/72694. Cell : 8886090199. E-mail ID : ananthaprabha@gmail.com